క్లుప్తంగా

'జగనన్న ఆణిముత్యాలు'కు గురుకులం విద్యార్థి


సోమశేఖర్

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి మండలంలోని కారాడ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి బడే సోమశేఖర్ (584 మార్కులు)ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశేఖర్ పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో రెండో స్థానాన్ని, నియోజకవర్గంలో మొదటి స్థానాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థికి రెండు స్థాయిల్లో రూ. 10 వేలు, రూ. 30 వేల నగదు సాయం ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. అలాగే గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన గురుకులాల ప్రిన్సిపాళ్లు, టాప్ టెన్ ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులను విజయవాడలో ఈనెల 24న ఘనంగా సత్కరించనున్నారన్నారు.

బాధితులను ఆదుకుంటాం: తహసీల్దార్


అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న తహసీల్దార్

రేగిడి: మండలంలోని పోరాం గ్రామంలో ఈనెల 19న గ్యాస్ సిలిండర్ పేలి జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులను ఆదుకుంటామని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి అన్నారు. శనివారం గ్రామానికి చేరుకుని బాధితులు సింగరాసి దాలయ్య, సింగరాసి రాములను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా 10 కిలోల చొప్పున బియ్యం అందించారు. నష్టంపై ఆరాతీశారు. ఐఏవై విభాగంలో ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కేల రాంబాబు, వీఆర్ఓ ఏవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని పారాదిలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కజొన్న తేమశాతం 12 కన్నా తక్కువగా ఉన్నప్పుడే కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, మండల ఉపాధ్యక్షుడు అరసాడ శంకరరావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు నానేశ్వరి, ఉమ, ఎస్‌పీ రాజు, మండల డీలర్ల సంఘ అధ్యక్షుడు గేదెల సత్యనారాయణ, అల్లాడ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారికే ఉపాధి

రేగిడి: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే రావాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలో తోకలవలస, వావిలవలస, లింగాలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులను శనివారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వేతనదారులకు అవగాహన కల్పించారు. రెండు పూటలా పనులు చేయాలని, నిర్దేశిత కొలతలు పూర్తి చేస్తే గిట్టుబాటు వేతనం అందుతుందని అన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారికి వందరోజుల పనిదినాలు కల్పించాలని, పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజాం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి స్వయంగా చీపురుపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన, కలుషిత నీరు తాగడం, అపరిశుభ్రతతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్ వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్వచ్ఛభారత్ కమిటీ సభ్యులు ఎస్.పోలారావు, కె.సాయిప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు నిస్వార్థం..

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


రాజాం: గడిముడిదాంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ లావేటి సులోచన, తదితరులు


బాడంగి: వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ప్రతి ఇంటికీ పరిచయమైన వ్యక్తి వలంటీర్ అని.. వారి నిస్వార్థ సేవలు అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి గుర్తింపు తీసుకువచ్చాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకే ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చిందన్నారు. అనంతరం పలువురు వలంటీర్లను సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు టి.మధుసూదనరావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, ఎంపీటీసీ సభ్యుడు డి.శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్లు జి.లక్ష్మణనాయుడు, పూడి కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు, తదితర నాయకులు, ఎంపీడీఓ కె.అక్కారావు, తహసీల్దార్ బాల మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


వంగర:అరసాడ గ్రామంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ


రేగిడి: అంబకండి-1 సచివాలయంలో వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


రాజాం సిటీ: పెనుబాకలో వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు, తదితరులు

జగనన్న పాలన అందరికీ ఆదర్శం

• ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి


లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలి: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధాంతాలు, పథకాల అమలు వంటి అంశాలను పొరుగు రాష్ట్రాలు కూడా అనుసరించే ప్రయత్నం చేస్తున్నాయని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పారాదిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని జనరంజక పాలనను చూసి ఓర్వలేని టీడీపీ నాయకుడు చంద్రబాబు, అతని అనుచరులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారెన్ని కుట్రలు పన్నినా ప్రజలు జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటారని తెలిపారు. తన హయాంలో సెంటు భూమి కూడా ఇవ్వలేని చంద్రబాబు ప్రస్తుత ముఖ్యమంత్రి జగనన్న ఇళ్లు నిర్మించి ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, మండల ఉపాధ్యక్షుడు అరసాడ శంకరరావు, కనిమెరక సత్యం, ఉత్తరావిల్లి అప్పలనాయుడు, ఎస్వీ రాజు, అల్లాడ ప్రసాద్, ధనుంజయనాయుడు, అల్లాడ ఈశ్వరరావు, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

• మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తెర్లాం మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి వి. లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకి చెబుదాం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి కనబరచవద్దని సూచించారు. మండలంలోని అన్ని ఎస్‌డబ్ల్యూపీసీల్లో చెత్త నుంచి సంపదను సృష్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

• హజ్‌యాత్రకు ఆర్థిక సహకారంపై ఆలిండియా మిల్లి కౌన్సిల్ హర్షం



ఎమ్మెల్యే శంబంగితో మిల్లీ కౌన్సిల్ కార్యవర్గం, సభ్యులు

బొబ్బిలి: హజ్‌యాత్రకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థిక సహాయం చేయడంపై కుల,మతాలకు, రాజకీయాలకు అతీతంగా పనిచేసే మిల్లీ కౌన్సిల్ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును కలిసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ.. కేంద్ర మైనారిటీ శాఖ, హజ్ కమిటీ సాంకేతిక తప్పిదాలతో ప్రతీ హజ్ యాత్రికుడిపై రూ.80 వేల భారం పడిన విషయం తెలుసుకున్న ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.14.21 కోట్లు యాత్రికుల కోసం విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మిల్లీ కౌన్సిల్ అధ్యక్షుడు హాఫిజ్ అబుల్ కలాం, జామియా మసీదు అధ్యక్షుడు హాజీ పీరా, హుదా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, ముస్లిం సోదర నాయకులు రజాక్, అజ్గర్ నాగు, ఏఎంసీ డైరెక్టర్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా నేత్ర వైద్యశిబిరం

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వాసవి (ఆర్యవైశ్య) కల్యాణ మంటపంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు రోగులను పరీక్షిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని రావాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా తనిఖీలు చేయించుకోవచ్చని, అయితే వారు ఈహెచ్‌ఎస్ కార్డు, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

• ఎమ్మెల్యే కంబాల జోగులు


జగదీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 588 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిన పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి లెంక జగదీష్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పొండ్రంకి నాగయ్య, పొగిరి పాఠశాల హెచ్‌ఎం శాసపు సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో విత్తన గుళికల తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ సీహెచ్ శారద ప్రకృతి వ్యవసాయం, విత్తన గుళికల ఆవశ్యకతను రైతులకు వివరించారు. అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న తదితర రకాల విత్తనాలను బీజామృతంతో కలిపి గుళికలుగా తయారు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా...

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

రాజాం: ఉద్యానవన పంటల సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు ఏపీడీ మీసాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రతీ పంచాయతీలో ఉద్యానవన పంటలు సాగుచేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు వివరాలను నెలాఖరులోగా సేకరించాలన్నారు. రైతులకు మామిడి, కొబ్బరి, జీడి, జామ ,సపోట తదితర పండ్ల జాతి మొక్కలు ఉచితంగా అందించడంతో పాటు మూడేళ్ల పాటు వాటి సాగుకు అయ్యే ఖర్చు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం, జేఈ నరేంద్రకుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మనబడి నాడు-నేడు పనులపై సమీక్ష

సీతానగరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మన బడి నాడు-నేడు పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. తొలుత తరగతి గదులు, రోడ్డు నిర్మాణాలను త్వరితగతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ అధికారి నారాయణస్వామి, ఎంఈఓ సూరిదేముడు, వెలుగు ఏపీఎం శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన మామిడి

రేగిడి: మండలంలో అంబకండి, ఉంగరాడ, లింగాలవలస, గుళ్లపాడు, బూరాడ తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. కోతదశలో ఉన్న మామిడి పంట నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

తెర్లాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రోగులు, గర్భిణులు వినియోగించుకోవాలని డాక్టర్ కిరణ్ అన్నారు. మండలంలోని గొలుగువలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, తదితరులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

రాజాం సిటీ: పట్టణంలోని మల్లికార్జునకాలనీలో ఏళ్ల తరబడి ఉన్న మురుగు సమస్యకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. డ్రైనేజీలు పూడికలతో నిండిపోవడంతో చిన్నపాటి చినుకులకే కాలనీలోకి మురుగు నీరు వచ్చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కమిషనర్ డీటీవీ కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన శనివారం కాలనీని సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బొబ్బిలి: పట్టణంలోని అర్హులైన ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. చైర్మన్ చాంబర్‌లో 13వ సచివాలయ ఉద్యోగులతో శనివారం సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సమయ పాలన పాటించాలని, సచివాలయానికి వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను, అవసరాలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

అక్కమ్మ పేరంటాల జాతర ప్రారంభం

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లిలో వెలసిన అక్కమ్మ పేరంటాలు 9వ జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పేరంటాలకు కుంకుమ పూజలు చేశారు. జాతర సందర్భంగా గ్రామ యువత యూత్ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఇరవై జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న విజయనగరం రఘు టీం సభ్యులతో రేలారే రేలా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

తెర్లాం: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి కల్యాణాన్ని శనివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు కె. రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో స్లీపర్ తత్కాల్ సేవలు ప్రారంభం

బొబ్బిలి: ఎన్నాళ్లుగానో బొబ్బిలి ప్రజలు వేచిచూస్తున్న స్లీపర్ తత్కాల్ సేవలను శనివారం నుంచి ప్రారంభించారని కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ గుప్తా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉదయం 10 గంటల నుంచి థర్డ్ ఏసీ తత్కాల్.. 11 గంటల నుంచి స్లీపర్ తత్కాల్ సేవలందించనున్నట్లు చెప్పారు. అలాగే రిజర్వేషన్ టైమింగ్‌ను ఉదయం 8 నుంచి 12 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మార్చినట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ నడుస్తుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• డిప్యూటీ సీఎం రాజన్నదొర


గడప గడపకు.. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రాజన్నదొర, తదితరులు

మెంటాడ: కుల,మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కుంటినవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలోకి తొక్కిన టీడీపీ, జనసేన వంటి పార్టీలు తప్పుడు వాగ్దానాలతో మరోసారి ప్రజల ముందుకు వస్తాయని, అలాంటి పార్టీలను నమ్మవద్దని సూచించారు.

నాలుగేళ్లలో 17 వేల కాలనీలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల కాలనీలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఎన్ని పట్టాలు ఇచ్చారో బహిరంగంగా చెప్పాలని సవాల్ విసిరారు. అలాగే అమరావతిలో 54 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వస్తే ప్రతిపక్షాలు అడ్డుకోవాలని చూడడం తగదన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రభుత్వ సొమ్మును దోచుకున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీ, జనసేనలకు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రావాడ ఈశ్వరరావు, పొరిపిరెడ్డి అరుణ, యాండ్రాపు సింహాచలం, వైకుంఠపు సత్యనారాయణ, పెదిరెడ్ల సూర్యనారాయణ, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్‌నాయుడు, చొక్కాకు సన్యాసినాయుడు, కనిమెరక త్రినాథరావు, తహసీల్దార్ ఆదిబాబు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే కంబాల జోగులు


గోళ్లవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు

సంతకవిటి: మండలంలోని గోళ్లవలసలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇల్లు లేనివారికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, స్థానిక సర్పంచ్ దాసరి దాలినాయుడు, మాజీ సర్పంచ్ కొప్పల ఉమామహేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గండ్రేటి కేసరి, స్థానిక నాయకులు టంకాల కాశి, వావిలపల్లి శ్రీరామమూర్తి, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏఓ పి.నవీన్, ఏపీఓ త్రినాథ్, ఏపీఎం సీతారాం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు తగవు..

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు


నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు

బాడంగి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు స్థలాలు కేటాయిస్తూ, ఇళ్లు నిర్మిస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఇటీవల ఎస్.కోట వచ్చిన చంద్రబాబునాయుడు పేదలకు ఇచ్చిన స్థలాలు శవాలను పాతిపెట్టడానికే సరిపోతాయని అనడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. చంద్రబాబు తీరుకు నిరసనగా మండల కేంద్రంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన హయాంలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని చంద్రబాబు నేడు పనికిమాలిన మాటలాడడం సరికాదన్నారు. వెంటనే ఆయన బడుగు, బలహీన వర్గాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

• మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్


నందిగాం ఆర్బీకేలో మాట్లాడుతున్న ఏఓ సునీల్‌కుమార్

తెర్లాం: మండల రైతాంగం ప్రకృతి వ్యవసాయం సాగు చేయడంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని నందిగాం ఆర్‌బీకేలో పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో నవధాన్యాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ సీజన్‌లలో వివిధ రకాల పంటలు పండించే ముందు నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, వీఏఏ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేలా అవగాహన

• ఉపాధి ఏపీడీ లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ లక్ష్మణరావు

తెర్లాం: బాల్య వివాహాలను అరికట్టేలా గ్రామీణ ప్రాంతాల్లోని కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులకు ఐసీడీఎస్, వైద్య శాఖ, సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సఖీ మండల స్థాయి సమావేశం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కిశోర బాలికలంతా సఖీ గ్రూపుల్లో చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పైనా, దిశ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే కలిగే అనర్థాలను వివరించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ జె.త్రినాథరావు, తెర్లాం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, తెర్లాం, పెరుమాళి, లోచర్ల ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు, ఉషారాణి, చిట్టెమ్మ, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు బాగు..

బొబ్బిలి: నవధాన్యాలను మొలకెత్తించి సాగుకు ముందు కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా మారి భూమి గుల్లబారి అధిక దిగబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. మండలంలోని పారాదిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏ, రైతుల సమక్షంలో 30 రకాల అపరాలతో నవధాన్యాలను కలిపి రైతులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి. ప్రసాదరావు, కె. శంకరరావు, జి. అనిత, వై. కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని బలోపేతం చేయాలి

బొబ్బిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత బలోపేతం చేసి కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్. గోపాలం డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వెలగవలసలో ఉపాధి హామీ వేతనదారులతో కలసి శనివారం నిరసన చేపట్టారు.